క్లుప్తంగా

వైఎస్సార్ బీమా మట్టి ఖర్చులు అందజేత



నాదెండ్ల: గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా గణపవరంలోని మూడో సచివాలయ సిబ్బంది మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందించారు. గ్రామంలోని వేలూరు రోడ్డులో నివాసం ఉండే బత్తుల శ్రీనివాసరావు (46) ఈ నెల 18న ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా వర్తించటంతో భార్య నాగమణికి బుధవారం మూడో సచివాలయ కౌన్సిలర్ పిల్లి సాగర్‌బాబు, సచివాలయ కార్యదర్శి కె.కవిత, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాజాఖీజర్‌లు నగదు సాయం అందించారు. మిగిలిన మొత్తాన్ని ధ్రువపత్రాలు అందిన అనంతరం మృతుడి భార్య నాగమణి బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సూరా శంకరరెడ్డి, కొండెపాటి నాగయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, రాఘవ, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



బొల్లాపల్లి: దాతలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సహకరించాలని మండల ఎంఈఓ2 పార్వతి తెలిపారు. మండల పరిధిలోని కనుమలచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎస్‌వీ ఛారిటీ ఆధ్వర్యంలో బుధవారం కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పార్వతి మాట్లాడుతూ తన శిష్యుడు పోక వెంకట్రావు మండలంలోని స్కూళ్లల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఛారిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్లలో అవగాహన ర్యాలీ



వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛభారత్ మండల రీసోర్స్ సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ స్లోగన్స్ వినిపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రావినూతల రంగారావు, సీహెచ్‌వో పఠాన్ మాబుసుభాని, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యం



చిలకలూరిపేట: ఉపాధ్యాయ సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు చెప్పారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం నిరంతర కృషి చేస్తున్నదని తెలిపారు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న అనేక సౌకర్యాలు ఎస్టీయూ సాధించినవేనని వెల్లడించారు. సుప్రీం కోర్టు తీర్పుననుసరించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లచే బోధన చేయించాలన్నారు. మున్సిపల్ స్కూల్స్‌కు అర్బన్ ఎంఈవోలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, షేక్ జమీర్‌బాష, అంకమ్మరావు, జయప్రకాష్, కాలేషా పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చింతలచెర్వు సెక్టారు పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజకుమారి పాల్గొని గర్భిణులు, కిషోర బాలికలు, బాలింతలు తీసుకోవాలని పౌష్టికాహారాన్ని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న బాలామృతం, పాలు, గుడ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జె.శ్రీదేవి, ఎస్‌కే. మౌలాబీ, కె. పరిశుద్ధం, జె. తిరుపతమ్మ, ఎం. రంగలక్ష్మి, ఈ. ఈశ్వరమ్మ, ఎం.అచ్చమ్మ, ఎంఎస్‌కే జ్యోతిర్మయి, ఎం.ఎల్ఎం మేరీవాణి, ఏఎన్ఎం రవణ, ఆశ వర్కర్ జి.అనురాధ, మహిళలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పందిళ్లలో గణనాథుడికి పూజలు



చెంఘీజ్‌ఖాన్‌పేటలోని చవితి పందిరిలో కొలువుదీరిన మహాకాయుడు



పాలపాడురోడ్డులో కరెన్సీ నోట్లతో అలంకరించిన లక్ష్మీగణపతిని దర్శించుకొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



1108 అరటిపండ్లతో పూజలందుకున్న దశావతార సహిత శ్రీమహావీర గణపతి

నాదెండ్ల: వినాయక చవితి వేడుకలు బుధవారం మూడో రోజు మండలంలో ఘనంగా నిర్వహించారు. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మూడోరోజు కావటంతో పలుచోట్ల నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపవరంలోని సినిమాహాల్ రోడ్డులో రెండు విగ్రహాలను నిమజ్జనానికి కుప్పగంజివాగుకు తరలించారు. పశువుల ఆసుపత్రి సమీపంలో ఉన్న భారీ విగ్రహానికి మహిళలు ప్రత్యేక పూజల అనంతరం లలితా పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో మట్టి గణనాధునికి ప్రత్యేక పూజల అనంతరం పెంట్యాల వీరయ్య దంపతులు అందించిన ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. రాత్రికి విగ్రహాలు ఏర్పాటు చేసిన చలువపందిళ్లు, ఆలయాల వద్ద భక్తిరస కార్యక్రమాలు జరిగాయి.

యడ్లపాడు మండలంలో..

యడ్లపాడు: గణపతి నవరాత్రుల వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. వినాయకుడికి నిత్యం పూలు, పండ్లు, పిండివంటల నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు చవితి పందిళ్ల వద్ద విశేష అలంకరణలు చేస్తున్నారు. దాతలు సైతం రోజుకో వెరైటీ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తున్నారు. కమిటీ సభ్యులు సాయంత్రం వేళ పందిళ్లలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. భక్తులు ఆయా కార్యక్రమాలో చురుగ్గా పాల్గొని తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు.

వైభవంగా గణపతి నవరాత్రుల ఉత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: చవితి పందిర్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా పందిర్లలోని గణనాధునికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజాధికాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. కాకుమాను బజార్‌లోని చవితి పందిరిలో 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన త్రిలోక విజయ గణపతి భారీ విగ్రహం, దాని ముందు ఆది దంపతులైన ఉమా మహేశ్వరులకు గణపతి ప్రదక్షణం చేస్తున్నట్టు ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే పాలపాడు రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో రూ.18లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో గణపతిని, పందిరిని అలంకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి లక్ష్మీగణపతిని దర్శించుకుని పూజలు జరిపారు. పాతూరు మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్ స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దశావతార సహిత మహావీర గణపతిని 1108 అరటిపండ్లతో సహస్ర అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపారు. కాగా, బుధవారం సాయంత్రం పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన చిన్న చవితి పందిర్లలోని గణపతి విగ్రహాలను నిమజ్జనం నిమిత్తం తరలిస్తున్నారు.

రెండు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనోత్సవాలు

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, నల్లగార్లపాడు గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం గ్రామంలో జగన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని ఆ గ్రామానికి చెందిన బోయపాటి వెంకటరెడ్డి రూ.36 వేల రూపాయలకు వేలంలో పాడుకున్నారు. అలాగే నల్లగార్లపాడు గ్రామంలో వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాన్ని మద్దూరి బంగార్‌రెడ్డి రూ. 12 వేల రూపాయలకు పాడుకున్నారు. మాచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని మోర్జంపాడు గ్రామం వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. నల్లగార్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని బాపట్ల వద్ద సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. వినాయకుని విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమాలు గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణాన్ని నెలకొల్పింది.

లడ్డూ ఖరీదు రూ.38 వేలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో కాకతీయ సేవా సమితి యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 9 వార్షికోత్సవ పురస్కరించుకుని కమిటీ సభ్యులు వేడుకలు వైభవంగా నిర్వహించారు. విగ్రహ దాత పొందూరి హరిబాబు-సత్యవతి దంపతులు,, 18 కేజీల లడ్డూ దాత పాలడుగు నాగాంజినేయులు అందజేసినట్లు కమిటీ సభ్యులు చెప్పారు. వినాయక విగ్రహం లడ్డూను బహిరంగ వేలంపాటలో గ్రామానికి చెందిన చెరుకూరి గోవిందరాజుల రూ. 38 వేలు కైవసం చేసుకున్నాడు.

భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. విగ్రహం నిమజ్జనం వేడుకల్లో భాగంగా మేళా తాళాలు కనకతప్పట్లు నడుమ విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో ఘనంగా ఊరేగించారు.



గణపవరం పశువుల ఆసుపత్రి వీధిలో లలితాపారాయణం చేస్తున్న భక్తులు



స్వామివారి లడ్డూని దక్కించుకున్న చెరుకూరి గోవిందరాజులు



కాకుమాను బజారులోని త్రిలోక విజయగణపతి విగ్రహం



గణపవరంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాధులు

వన్‌టౌన్ ఎస్‌గా రహంతుల్లా

నరసరావుపేట టౌన్: వన్‌టౌన్ ఎస్ఐగా షేక్ రహంతుల్లా బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రహంతుల్లాను సాధారణ బదిలీలో భాగంగా వన్‌టౌన్‌కు బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

రేపు పల్నాడు కళాక్షేత్రం ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: కళలకు కాణాచిగా పేరుపొందిన నరసరావుపేటలో పల్నాడు కళాక్షేత్రంను ఈనెల 22వ తేదీన ప్రారంభిస్తున్నట్టు కళాక్షేత్రం అడ్‌హక్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.ఎం.భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కళల నిత్య సాధనల సమన్వయ కేంద్రంగా కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, జానపదం, ఫిల్మ్ మేకింగ్ తదితర కళలను సాధన చేసేందుకు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు కళాక్షేత్రం దోహదపడుతుందని స్పష్టం చేశారు. పల్నాడు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి అట్లూరి సుభాష్ దీప్తి తదితరలు పాల్గొంటాని తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై సురేంద్రబాబు బుధవారం తెలిపారు. ములకలూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించి అక్కడ అక్రమంగా మద్యం కలిగి ఉన్న షేక్ జానీ భాషాను అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద పది తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

ఎంపీడీవో హనుమారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో వై హనుమారెడ్డి

యడ్లపాడు: గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఆరోగ్యశ్రీ యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిస్థాయి వివరాలను తెలుసుకుని అనారోగ్య సమస్యలు ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై హనుమారెడ్డి చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వివరాలపై బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆరోగ్యశ్రీ పథకంపై మండల ప్రజలకు గ్రామస్థాయి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే అన్ని సేవలు ఉచితమే అన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో ఏఎన్ఎంలు వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల పరీక్షలను చేస్తున్నారని తెలిపారు. ఆయా పరీక్షల అనంతరం ఈనెల 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ జరిగే మెగా వైద్య శిబిరాలకు సంబంధించి టోకెన్లను అందజేస్తారన్నారు. టోకెన్లలో సూచించిన తేదీల ప్రకారంగా నిర్వహించే వైద్యశిబిరాలను తప్పక సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఆయా శిబిరాల్లో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు మరోఇద్దరు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు హాజరవుతారన్నారు. అవసరమైన అన్ని రకాల పరీక్షలతో పాటు వ్యాధి సమస్యను బట్టి పెద్ద ఆస్పత్రులకు సైతం సిఫార్సు చేస్తారన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ఈపూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్ఎం ఎన్. రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.అంకుల్ ప్రారంభించారు. పోటీల్లో ఈపూరు, ముప్పాళ్ల, ఇనిమెళ్ల, కొచ్చర్ల, కొండ్రముట్ల, బొగ్గరం జెడ్పీహెచ్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ నుంచి బాల బాలికలు హాజరయ్యారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులందరూ స్నేహంగా, క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని మీ నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఈపూరు మండలానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. జెడ్పీటీసీ చౌడయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడి మరిన్ని విజయాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఆటల పోటీల సందర్భంగా ఈపూరు పాఠశాలకు చెందిన క్రీడాకారులకు ఉపాధ్యాయులు డి.సుబ్రహ్మణ్యం, వి.అనురాధ, ఏపీటీఈఈ యూనియన్ 1104 ఎన్ఆర్‌టీ అధ్యక్ష, కార్యదర్శులు, అంగలూరు సొసైటీ సిబ్బంది జి. శేఖర్ క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, వై.చిరంజీవి, ఎస్. రూత్‌మేరి, గోపి, ఝాన్సీ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించటానికి ప్రభుత్వం ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి మంజూరు చేసినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో రాణించడానికి క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలు 31 ఉండగా ఒక్కో స్కూలుకు 9 క్రీడా పరికరాలతో కూడిన క్రీడా సామగ్రి కిట్టు, యూపీ స్కూలు 3 ఉండగా 14 రకాల క్రీడా సామగ్రి, జడ్పీ ఉన్నత పాఠశాలలు 5 ఉండగా 17 రకాల క్రీడా సామగ్రి కల్గిన కిట్లను ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితాకుమారి, సీఆర్‌పీ రావూరి శివప్రసాదు, శ్రీహరి, త్రివిక్రమ్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్స్ గేమ్స్‌లో పలువురు విద్యార్థుల ఎంపిక

చిలకలూరిపేటటౌన్: మండలస్థాయి స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని కావూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం మండలంలోని కావూరు గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో వివిధ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగం కబడ్డీలో ముగురు విద్యార్థులు, అండర్-17 విభాగం కబడ్డీలో ముగ్గురు, అండర్-14 వాలీబాల్‌లో ఒకరు, అండర్-17 వాలీబాల్‌లో ఒకరు, అండర్-14 యోగాలో ముగ్గురు, అండర్-17లో ఇద్దరు విద్యార్థులు ఇలా మొత్తం 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న జెసీ, హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు



ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు క్రీడాసామగ్రి కిట్టును అందజేస్తున్న ఎంఈవోలు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐటీసీ-మైరాడా సేవలు అభినందనీయం

ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న చుండూరి వెంకటేశ్వర్లు

శావల్యాపురం: ఐటీసీ బంగారు భవిష్యత్ వారి సారథ్యంలో మైరాడా వారి సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొండ చుట్టూ చిన్నపాటి కాలువ తీయటంతో పాటు ఇంకుడు గుంతలు తీసే పనులకు చేపట్టటం అభినందనీయమని ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని కారుమంచి గ్రామ సమీపాన ఉన్న కొండ మార్గంలో ఉమ్మడి వనరుల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో పచ్చదనం కోల్పోకుండా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. కొండ భాగంలో వర్షపు నీరు నిల్వ ఉండేలా ఇంకుడు గుంతలు తీయడంతో పాటు కొండ చుట్టూ ఏరియాలో వివిధ రకాల విత్తనాలు వెదపెట్టటం ద్వారా జీవరాశులు వన్యప్రాణాలు పెంపుదలకు దోహదపడుతుందన్నారు. ఇంకుడు గుంతలు తీయటం ద్వారా భూగర్భ జలాలు పెంపుదలతో పాటు మొక్కలన్నీ పచ్చగా ఉంటాయన్నారు. చుట్టు పక్కల పొలాలు కూడా నీటి వసతి సమృద్ధిగా ఉంటుందన్నారు.అనంతరం పొక్లయినర్ ద్వారా ఇంకుడు గుంతల తీసే పనులకు పూజకార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కె.మంజూనాధ్, శిరీషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొర్రె పిల్లల అపహరణ

నకరికల్లు: గొర్రె పిల్లల అపహరణపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎ.బాలకృష్ణ అందించిన వివరాలు.. తెలంగాణకు చెందిన మోదీపురం చిన అప్పారావు, మరికొందరు కలసి గొర్రెలు మేపుకునేందుకు మండలంలోని కుంకలగుంట గ్రామంలోని పొలాలకు వచ్చారు. 19వ తేదీ రాత్రి చుట్టూ ఇనుపజల్లెడ ఏర్పాటు చేసి వాటి మధ్యలో గొర్రెపిల్లలను ఉంచి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారిన తరువాత చూస్తే ఐదుగురికి చెందిన 17 గొర్రెపిల్లలు కన్పించడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు

భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



పలుదేవర్లపాడులో రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.భవానీ శంకర్

పలుదేవర్లపాడు(ముప్పాళ్ల): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయా లని తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ కోరారు. మండలంలోని పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియను బుధవారం పరిశీలించారు. మొదటి విడతగా ఆరు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభమైందని, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించాలని కోరారు. వందేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టిందని వివరించారు. సర్వే ఆఫ్ ఇండియా జాతీయ సంస్థ సహకారంతో ఆధునిక విధానంలో సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వే జరిగే ప్రాంతంలోని రైతులకు మూడు రోజులు ముందుగానే నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ డ్రాపవుట్లను గుర్తించాలి

సత్తెనపల్లి: వివిధ కారణాలతో చదువును మధ్యలో మానేసిన పదో తరగతి, ఇంటర్ పూర్తి చేయని వారిని వలంటీర్ల సహకారంతో గుర్తించి టెన్త్, ఇంటర్‌లో వారికి అడ్మిషన్లు కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు కోరారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. గుంటూరు ఏపీఓఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ మాట్లాడుతూ ఈ సువర్ణ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఏ రాఘవేంద్రరావు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏ మాధవీలత, ఈ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతిపై అవగాహన సదస్సు

నకరికల్లు: ఉన్నతి కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం రామకృష్ణ తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీయువకులకు ఉన్నతి కార్యక్రమంపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్లలో ఆక్వాకల్చర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏరోనాటికల్, కోటప్పకొండలో కంప్యూటర్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

పేరూరుపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



పేరూరుపాడులో జగనన్న ఆరోగ్య సురక్షలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆక్టోబరు 3 నుంచి నిర్వహించే వైద్య శిబిరంలో చికిత్స అందజేయడం జరుగుతుందని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. వీర నరేష్ తెలిపారు. పేరూరుపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా సర్వే ప్రారంభమైందన్నారు. ప్రతి ఇంటికి వైద్య బృందం కంటి జబ్బులు, గర్భిణులు, ఐదు ఏళ్లలోపు చిన్నారులు వ్యాక్సినేషన్, సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఏమైనా వ్యాధులు ఉన్న వారిలో షుగర్, బీపీ రోగులకు పరీక్షలు, టీబీ, జ్వరం వంటి జబ్బులకు పరీక్షలు చేసి అక్టోబర్ 3న ఈ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. చికిత్సలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరంలో బొల్లాపల్లి, వెల్లటూరు పీహెచ్‌సీకి చెందిన ఇరువురు వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులు ఇరువురు, సంబంధించిన నలుగురు వైద్యులతో శిబిరంలో వైద్య సేవలు ఉంటాయని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య నిపుణులతో కూడిన వైద్య బృందం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు.